క్లుప్తంగా

కట్టకిందపల్లెలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య అన్నారు. మండలంలోని కట్టకిందపల్లె గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, రోసలిన్, కోమల, బాబు, కిషోర్, నిత్య, పంకజం పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు అప్పగింత



గుడిపాల: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను తీసుకువచ్చిన శ్రీరామభక్తులు

గుడిపాల: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామచంద్రుడి అక్షింతలు బుధవారం మండలానికి చేరాయి. అయోధ్యనుంచి చిత్తూరులోని రాములగుడి వీధిలోని కోదండరామస్వామి దేవాలయానికి వచ్చిన అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడినుంచి శ్రీరామ భక్తులు వసంతాపురంలో ఉన్న వినాయకుని దేవాలయానికి తీసుకొచ్చారు. వీటిని మండలంలోని ప్రతి ఇంటికీ అందజేయనున్నట్లు తెలిపారు. జనవరి 2024లో అయోధ్యలో శ్రీరామ ఆలయ కుంభాభిషేకం ఉంటుందని వివరించారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి

చిత్తూరు రూరల్: కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి అన్నారు. నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కులగణనపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. శిక్షణ సద్వినియోగం చేసుకుని సర్వే విధి విధినాలు, నమోదు వివరాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఓ సౌందర్ రాజన్, ఏఓ రాఘవేంద్ర వర్మ, ఎంఈఓ సెల్వరాజ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై ఎస్ఈబీ తనిఖీలు



చిత్తూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: గంజాయి విక్రయాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో అర్బన్ సీఐ జోగేంద్ర, శిక్షణా ఏఈఎస్ ఊహాసిరి, సిబ్బంది కలిసి పోలీసు జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి గంజాయి లభించలేదు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ తెలిపారు.

అయ్యప్పస్వామికి ఘనంగా అంబలం పూజ

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని అల్లియల్లమ్మ తల్లి దేవస్థానం మండపంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలం పూజ వైభవంగా జరిగింది. కార్తీకమాసం సందర్భంగా జీడీ నెల్లూరు గ్రామంలోని అయ్యప్ప మాలధారులు కఠిన ఉపవాస దీక్షతో భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టి, విద్యుత్ దీపాలతో అలంకరించి అత్యంత నియమాలతో అంభలం కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలు అయ్యప్ప స్వామి భజనలతో మార్మోగాయి. కార్యక్రమంలో గురుస్వామి మునస్వామి, గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యం, అల్లియల్లమ్మ ఆలయ ధర్మకర్త రవీంద్రారెడ్డి, రామాచారి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో (శ్రీకామాక్షి అమ్మవారి హోమం) చండీయాగం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజ, హోమ మహోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్నాయి. భక్తులు రూ.500 టికెట్‌తో ఒకరోజు హోమంలో పాల్గొన్నారు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేశారు.

అన్ని వర్గాలకు అండగా నిలిచాం

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- అన్ని మండలాల్లో వై ఏపీ నీడ్స్ జగన్
- సంక్షేమ బోర్డులు, జెండాల ఆవిష్కరణ





చిత్తూరు: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బంగారుపాళెం: రాగిమానుపెంటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారని, అందుకే మళ్లీ గెలిపించాలని కోరుతున్నామంటూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. పాల్గొన్న ఎమ్మెల్యే సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ రూపొందించిన బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టాక ఈ సచివాలయం పరిధిలోని ప్రజలు సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలు లబ్ధి పొందారని చెప్పారు. రైతు సేవలన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనీన తప్పకుండా అమలు చేశారన్నారు. అవన్నీ కూడా పారదర్శకంగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయరాం, నాయకులు సురేష్, నంద, రాజు, మునిరత్నం, జయపాల్, దేవేంద్ర పాల్గొన్నారు.

పారదర్శక పాలన

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారదర్శక పాలన సాగుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వెంకటేశ్వరకాలనీలో బుధవారం మేయర్ అముదతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో సంక్షేమ, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి, అనంతరం కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు టిమ్ము, నగర సచివాలయ కన్వీనర్ రాంగణేష్ నాయకులు రెడ్డెప్ప, జగన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా అర్హత పొందిన ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను అందజేశాయని మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేపనపల్లి సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, నాయకులు రాజరత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సర్పంచులు వసంతమ్మ, మణి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గౌరి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, నాయకులు అమర్‌నాథరెడ్డి, బాలాజీ, షణ్ముగం, నాగరాజ, సుధాకర్ రెడ్డి, సుబ్రమణ్యం, మండల యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే సంక్షేమ బావుటా

బంగారుపాళెం: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ బావుటా ఎగురవేశారని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని రాగిమానుపెంట గ్రామంలో బుధవారం సాయంత్రం సర్పంచ్ శ్రీహరి ఆధ్వర్యంలో ‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ అమరావతి, మాజీ వైస్ ఎంపీపీ వేణుగోపాల్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, గ్రామ కార్యదర్శి మనోజ్‌తోపాటు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి

గుడిపాల: అన్ని వర్గాల్లో పేద ప్రజలకు మేలు చేకూరాలంటే సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మసముద్రం సచివాలయ ఆవరణలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ నాయకులతో కలిసి ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దయానందరెడ్డి, పద్మనాభరెడ్డి, రవి, సాయి, రవీంద్రారెడ్డి, వెంకటేశులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గెలిపించుకుందాం

ఐరాల: సంక్షేమ పథకాల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఎం.పైపల్లె సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలతో నేడు జనమంతా సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. గడిచిన చంద్రబాబు పాలనలో 14 ఏళ్ల ప్రజలు మోసపోయారని గుర్తుచేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరుకావాలన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండల కేంద్రంలోని సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామీణ ప్రజలకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించనున్నట్లు వివరించారు. దీనికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొదలమడుగులో..

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు గ్రామ సచివాలయంలో గురువారం ‘ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ అమరావతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు.









చిత్తూరు: జెండా ఆవిష్కరణలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఐరాల: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, గుడిపాల: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పూతలపట్టు: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

వేడుకగా కుంభాభిషేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ కుంభాభిషేక పూజలను బుధవారం వేడుకగా నిర్వహించారు. మూలస్థానంలోని స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. హోమం, కలశ పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం భాగ్యం కల్పించారు. ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కులగణన సర్వేపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని అయ్యప్పగారిపల్లి సచివాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కులగణనపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ అసిస్టెంట్లు, వలంటీర్లు పొరబాట్లకు తావులేకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం

పుత్తూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రత్యేకించి మహిళలు అవగాహన కలిగి ఉండాలని టాటా ట్రస్ట్ అధికారి హేమంత్ తెలిపారు. స్థానిక రాస్ మహిళా పొదుపు సంఘ సభ్యుల సౌకర్యార్థం బుధవారం టాటా ట్రస్ట్, స్వీకార్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆరోగ్యంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మహిళల్లో గర్భసంచి, బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని చెప్పారు. శిబిరంలో 115 మందికి రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి, నోటి, రొమ్ము, గర్భాశయం క్యాన్సర్లకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, ప్రకాష్, తేజు, శేఖర్, శివ, రెడ్డికుమారి పాల్గొన్నారు.

సంజీవరాయశర్మ గొప్ప గణిత అవధాని



గణిత అవధానంలో విద్యార్థులు

బంగారుపాళెం: గణిత అవధాన విద్యలో లక్కోజు సంజీవరాయశర్మ గొప్పవారని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి అన్నారు. సంజీవరాయ శర్మ జయంతిని బుధవారం ఏపీ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్‌శివప్రసాద్ మాట్లాడుతూ, మన తెలుగువాడైన లక్కోజు సంజీవరాయశర్మ గణిత అవధాన విద్యలో ఎంతో ప్రతిభ చూపినప్పటికీ ఆయనకు తగిన గుర్తింపు రాకపోవడం బాధాకరమన్నారు. 9వ తరగతి విద్యార్థి పునిత్‌సాయి సంజీవ రాయశర్మ వేషధారణలో చేపట్టిన నమూనా గణిత అవధాన కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థిని హేమ లక్కోజు జీవిత విశేషాలను గురించి వివరించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవి, సంపంగి, పిళ్లారప్ప, ప్రేమకృష్ణ, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, భారతి పాల్గొన్నారు.

మంచు కొండ







కలియుగ వైకుంఠ దైవం వెలిసిన తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్డులో పొగ మంచు భారీగా కురుస్తోంది. కొండలను మంచు కప్పేస్తుండడంతో వెండికొండలా మారింది. పగటి వేళ కూడా వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్తున్నారు. తిరుమలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. మంచి సోయగాలతో చెట్లన్నీ పచ్చదనాన్ని వెదజల్లుతున్నాయి. – తిరుమల



ఆరోగ్యమే మహాభాగ్యం



జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



రోగులకు బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

- ఆరోగ్య సురక్షతో పేదలందరికీ వైద్యం
- సురక్షతో 7,200 మందికి వైద్య పరీక్షలు
- మెరుగైన వైద్యం కోసం 168 మంది రెఫరల్

తవణంపల్లె: ఆరోగ్యమే మహాభాగ్యమన్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోని పేదవాడికి మంచి వైద్యం అందించాలనే సంకల్పంతో అమలు చేసిన జగనన్న సురక్ష ఆరోగ్య పథకానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 32 పంచాయతీల్లో 17 సచివాలయాల పరిధిలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక నేతృత్వంలో వైద్యాధికారులు తమ బృందంతో 17 జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. వైద్యులు క్యాంపుల్లో 7,200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం అందించేందుకు 168 మందిని ఎంపిక చేసి రెఫరల్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంది పేదలకు మెరుగైన వైద్యసేవలందించడానికి వేదికగా మారింది.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



మండలంలోని పేదలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. మండలంలో నలుగురు డాక్టర్లు పేద ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్యం చేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 7,200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించాం. మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశాం.

– డాక్టర్ ప్రియాంక, వైద్యాధికారి, తవణంపల్లె

ఆస్తమాకు వైద్యం చేయించుకున్నా



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో నాకు ఆస్తమా సమస్య ఉందని చెప్పారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కారణంగా మా ఊరికి వచ్చి డాక్టర్లు వైద్యం అందించారు. సీఎంకు రుణ పడి ఉంటాం. – విజయమ్మ, ఉత్తరబ్రాహ్మణపల్లె

నరాల నొప్పితో బాధపడుతున్నా



నరాల నొప్పితో చాలా కాలంగా బాధపడుతున్నా. మా గ్రామానికి వైద్యులు వచ్చి పరీక్షలు చేశారు. ఉచితంగా మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ఉచితంగా మందులు ఇచ్చారు. జగన్‌మేలు మర్చిపోం.

–చంద్రయ్య, ఉత్తరబ్రాహ్మణపల్లె

కంటి పరీక్షలు చేయించుకున్నా



మా గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు కంటి పరీక్షలు చేశారు. కంటి పొర తీయించుకోవాలని సూచించారు. అగర్వాల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

–లక్ష్మి, ఉత్తరబ్రాహ్మణపల్లె